క్లుప్తంగా

నేడు మంత్రి రాక..

ఎల్కతుర్తి: నేడు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ప్రజా గ్రంథాలయంలో మహనీయుల విగ్రహాలు ఆవిష్కరించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొయినపల్లి వినోద్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ హాజరు కానున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి కోరారు.

నిధులు మంజూరు చేయాలి



ధర్మసాగర్: మండలంలోని సాయిపేట గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సాయిపేట గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై కడియం సానుకూలంగా స్పందించి తన సీడీపీ నిధుల నుంచి మహిళా సంఘ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎంపీడీఓకు సన్మానం



కమలాపూర్: ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు పొందిన ఎంపీడీఓ పల్లవిని ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు భూపతి రాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పాలకుర్తి మాధవిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు మునీందర్, ప్రధాన కార్యదర్శి కార్తీక్, వాసవి క్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి పున్నంచందర్, సభ్యులు కంబంపాటి ప్రసాద్, అయిత ఓంప్రకాష్, భూపతి చంద్రమౌళి, జగదీశ్వర్, వీరభద్రయ్య, నాగేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, సాగర్, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన సర్పంచ్

ఆత్మకూరు: ఇటీవల సస్పెన్షన్ అయిన ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి రాజు తిరిగి బాధ్యతలు చేట్టారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

సర్పంచ్ హర్షం

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామం నుంచి పరకాల, హనుమకొండ రహదారి వరకు బీటీ రోడ్డు పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినందుకు గాను సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి గురువారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిలు ప్రభుత్వం నుంచి రూ. 1 కోటి నిధులు మంజూరు చేయడం సంతోషకరమని తెలిపారు. బీటీ రోడ్డు పనులు దసరా వరకు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



ధర్మసాగర్: మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారు నవనాగక్షేత్రంలో సెప్టెంబర్ 10వ తేదీన శ్రీ భద్రకాళీ దేవస్థానం ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు ఆధ్వర్యంలో నవనాగయ జనపురస్సర నక్షత్రారామ ప్రతిష్ట మహోత్సవము నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ గంట పవన్‌శర్మ తెలిపారు. ఈ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు గురువారం ఆహ్వాన పత్రిక అందచేశారు.

ఫొటోగ్రాఫర్‌కు నివాళి



దేవరాజు(ఫైల్)

దామెర: అనారోగ్యంతో ఫొటోగ్రాఫర్ మృతిచెందారు. ఈ సంఘటన మండలంలోని పసరగొండ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శనిగరం దేవరాజు(35) కొంత కాలంగా ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల అనారోగ్యం బారిన పడిన అతను బుధవారం రాత్రి మృతి చెందారు. కాగా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు సదానందం, అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, భరోసా ఇన్‌చార్జ్‌లు నివాళులర్పించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి



ఎల్కతుర్తి : హనుమకొండ-కరీంనగర్ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



దామెర : మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవు సాంబయ్య

ఎల్కతుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులందరికీ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు గురువారం మండల కేంద్రంలోని హన్మకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి మాట్లాడుతూ అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులు, దళితబంధు, బీసీబంధు, మైనారిటీబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల శంకరయ్య, జనగానీ కిష్టయ్య, వెంకటేష్, పల్లెపాటి మధూకర్, యార సదానందం, ఆరేపల్లి వినోద్‌కుమార్, నార్లగిరి వెంకటేష్, శ్రీకాంత్, వినయ్‌గౌడ్, ప్రశాంత్, మధు, సంపత్, శ్యామ్‌సింగ్, రవి, శ్రీనివాస్, అంచనగిరి వెంకట్, నాగరాజు, రాములు, రాకేష్ పాల్గొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృధ్వీరాజ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. లక్ష్మారెడ్డి, కుమార్, ప్రకాశ్, సదానందం, సంపత్, సాయితేజ పాల్గొన్నారు.

శాయంపేట : బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాయరాకుల మొగిలి విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను తెలుపుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఏర్పడి 9సంవత్సరాలు గడుస్తున్నా నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు, బీసీబంధు, మైనారిటీ బంధు ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాయమాటతో కేసీఆర్ మరోసారి వస్తున్నారని, ప్రజలు మోసపోవద్దని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నాయకులు విద్యాసాగర్, దేవరాజ్, నవీన్, రాజశేఖర్, సుమన్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నడికూడ: రాష్ట్ర ప్రభుత్వం హామీలు ప్రకటించి సరిపెడుతుందని, వాటిని అమలు చేయడంలో విఫలమవుతుందని బీజేపీ నాయకుడు బెజ్జంకి పూర్ణచారి ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసిస్తూ మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేవలం హామీల ప్రభుత్వం అని, దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు, ప్రకటించి గాలికొదిలేశారని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం కేసీఆర్ ప్రజలను అయోమయానికి గురి చేసి మరోసారి మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుజ్జుల సత్యనారాయణ, రాజవీరు, సురేష్, రవీందర్, సాంబరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. సీఎం కేసీఆర్ మాయమాటలతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సదానందం, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, ఆర్‌టీఐ కన్వీనర్ శ్రావణ్‌కుమార్, సదానందం, రవి తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్: రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం బోగస్ అని, నిజమైన పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం మండల ప్రధాన కార్యదర్శి భూపతి ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతున్నా సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన హామీలు అమలు చేసిన తర్వాతనే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ మాటం రమేష్‌బాబు, వార్డు సభ్యుడు శ్రీనివాస్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ర్యాకం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్, పట్టణ అధ్యక్షుడు నాసని రాజు, మధుసూదన్‌రెడ్డి, ఇంజపురి రాజేందర్, నరేష్, మాటం అశోక్, చందర్‌సింగ్, బుర్ర కుమారస్వామి, వాసాల సత్యం, ఎలుగం రాజు పాల్గొన్నారు.

దామెర: రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దేవు సాంబయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గురువారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. రెండు దఫాలు ఎమ్మెల్యేగా గెలిచిన ధర్మారెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. దళితులకు 3 ఎరాల భూమి, డబుల్ బెడ్రూం, దళితబంధు, నీళ్లు, నిధులు, నియామకాల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నియోజకవర్గంలో దళితబంధు, బీసీబంధు ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, జిల్లా నాయకులు వీసం రమణారెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ రతన్‌కుమార్, వివిధ మోర్చల అధ్యక్షులు రమేష్, బుచ్చిరెడ్డి, చందర్, జగన్, మండల ప్రధాన కార్యదర్శి సతీష్, జగన్మోహన్‌రెడ్డి, నాగరాజు, శ్రీను, మహేందర్, సుధాకర్, సాంబరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ కృషితోనే రాష్ట్రాభివృద్ధి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

శాయంపేట : సీఎం కేసీఆర్ కృషితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని కొప్పుల గ్రామంలో ఇంటింటికీ సంక్షేమ ఫలాల కార్యక్రమం గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోలి మధురిమహేందర్‌రెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, నాయకులు సామల మధుసూదన్, గుర్రం సుధాకర్, భాస్కర్, కుమారస్వామి, శ్రీనివాస్, వెంకన్న, ఆదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, సాయిరాం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



కమలాపూర్ : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



దామెర : మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీందర్

కమలాపూర్: గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ పల్లవి సూచించారు. మండలంలోని గూడూరులో కొనసాగుతున్న సర్వేను గురువారం ఆమె పరిశీలించి సర్వే బృందం సభ్యులకు పలు సూచనలు చేశారు. స్వంత భూమి కలిగి ఉండి ఇళ్లు నిర్మించుకునే ప్రతీ కుటుంబాన్ని అర్హులుగా గుర్తించాలని సూచించారు. అనంతరం గూడూరులో రూ.20 లక్షల ఆర్‌జీఎస్‌ఏ నిధులతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సర్పంచ్ అంకతి సాంబయ్య, ఈజీఎస్ ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శులు వినీల్‌రెడ్డి, సృజన, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దామెర: గృహలక్ష్మి లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జరుగుతున్న క్షేత్రస్థాయి సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. సర్వే చేస్తున్న క్రమంలో దరఖాస్తుతో జతపరిచిన పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 18 వ తేదీ లోగా సర్వే పూర్తి చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని పేర్కొన్నారు. అలాగే దమ్మన్నపేట్‌లో చేపట్టిన సర్వేలో పంచాయతీ కార్యదర్శి మద్దూరి పద్మ, కారోబార్ లక్కిడి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అసెంబ్లీ, పార్లమెంట్‌లో రిజర్వేషన్ కల్పించాలి



బీసీ చైతన్య యాత్ర చేపట్టిన నాయకులు

ఎల్కతుర్తి: అసెంబ్లీ, పార్లమెంట్‌లో బీసీలకు కూడా రిజర్వేషన్ వ్యవస్థను తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ మచ్చిముట్ల రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో బీసీ చైతన్యయాత్ర నిర్వహించి మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రెండు లక్షల 30వేల ఓటర్లు ఉంటే బీసీలు లక్షా 60వేల మంది ఉన్నారని వెల్లడించారు. వివిధ పార్టీలు బీసీలను పట్టించుకోకుండా ఓసీ వర్గాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. మెజారిటీ వర్గమైన బీసీలను కాదని తక్కువ శాతం ఉన్న ఓసీలకు గత 20 ఏళ్ళుగా ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వడం సరికాదన్నారు. బీసీలకు గొర్లు, బర్లు ఇవ్వడం తప్ప రాజ్యాధికారాన్ని కట్టబెట్టేందుకు ముందుకు రాని కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎంలని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అసెంబ్లీ, పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల మాదిరిగా బీసీలకు రిజర్వేషన్ వ్యవస్థను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు పూదరి రవీందర్‌గౌడ్, నాయకులు తాళ్ళపల్లి లక్ష్మణ్‌గౌడ్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఏబీఎం సుధాకర్

దామెర: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎల్‌ఐసీ జిల్లా ఏబీఎం సుధాకర్ అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ కమ్యూనిటీహాల్ ఆవరణలో ప్లాంట్ ఏ లైఫ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు నాటిన మొక్కలను సంరక్షించి వృక్షాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. మానవ మనుగడ కొనసాగాలంటే మొక్కలు విరివిగా నాటాలని అన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎల్‌ఐసీ అధికారులు రామకృష్ణ, సంపత్, సురేష్, రాంబాబు, సీనియర్ ఏజెంట్ మన్నెం ఇంద్రారెడ్డి, ఎఫ్‌ఏ శంకర్, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కిరణ్, రైతుబంధు కోర్డినేటర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

ఎల్కతుర్తి: గత రెండున్నర దశాబ్దాలుగా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని కేశవాపూర్, తిమ్మాపూర్, బావుపేట బీసీకాలనీ, చింతలపల్లి, దామెర పాఠశాలతో పాటు తిమ్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం మహాసభల కరపత్రాలు ఆవిష్కరించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 15, 16, 17 వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. డీటీఎఫ్ ఆవిర్భావమై 24 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కౌన్సిలర్, సత్యపతి, శ్రీనివాసస్వామి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన పలువురు ఇటీవల అనారోగ్యతో మృతి చెందగా ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ పరామర్శించి 3 క్వింటాళ్ల బియ్యం, రూ. 5వేల నగదును ఆర్థిక సాయంగా అందించారు. ఆయన వెంట నాయకులు మారెపల్లి మోహన్, బత్తుల కార్తీక్, దైనంపల్లి కరణ్‌బాబు, అల్లం శ్రీధర్, దైనంపల్లి పాపయ్య, మారపల్లి ప్రభాకర్, పులిచేరు నరేందర్, గట్టు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సాంబయ్య



ఐనవోలు: తెలంగాణ గౌడ సంఘం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మండలంలోని వనమాలకనపర్తి గ్రామానికి చెందిన మాచర్ల సాంబయ్య నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని జిల్లా అధ్యక్షుడు శ్రీపతి గోపిగౌడ్ గురువారం అందించారు. సంఘం బలోపేతానికి సాంబయ్య చేసిన కృషి గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. గౌడలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరిస్తూ, హక్కులను సాధించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. గౌడ సంఘాన్ని బలోపేతం చేసేందుకు తనవంతు కృషిచేస్తానని సాంబయ్య తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా మండలంలోని గౌడ కులస్తులు ఆయనను అభినందించారు.

5కే రన్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

పరకాల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లను చైతన్య పర్చేందుకు ఈ నెల 19వ తేదీన పట్టణంలో 5కే రన్ నిర్వహించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. 5కే రన్ ర్యాలీలో యువతి, యువకులు పాల్గొనేలా చూడాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఓటర్లంతా స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకునేలా చర్య తీసుకోవాలన్నారు. ఓటుహక్కుపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ర్యాలీకి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరు కావాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ మడికొండ సంపత్‌కుమార్, పొరండ్ల సంతోష్, గొర్రె స్రవంతి, దామెర మొగిలి, ఆడప రాము, శనిగరపు రజని, కో ఆప్షన్ సభ్యుడు ఫాతిమా హమీద్, షబ్బీర్ అలీ పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు

ఐనవోలు: తనకు పంపిణీ చేసిన అసైన్డ్ పట్టా భూమిని కొందరు ఆక్రమించారని వారిని నుంచి భూమిని ఇప్పించి న్యాయం చేయాలని బాధితుడు ఎండీ అంకూస్ భార్య మహబూబ్‌బీ కోరారు. ఈ మేరకు గురువారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఎండీ అంకూస్‌కు 1986 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం వెంకటాపురం గ్రామంలోని సర్వే నంబర్ 367/16లో ఎకరం (అసైన్డ్) భూమిని పంపిణీ చేసిన చేసి పట్టా ఇచ్చినట్లు వినతిలో పేర్కొన్నారు. కానీ ఓ వ్యక్తి అక్రమంగా భూమిని తనపేరుపై పట్టా చేయించుకున్నట్లు తెలిపారు. భూమిని తన పేరుపై పట్టా చేసి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందించే పట్టాదారు పాసుబుక్కును తనకు మంజూరు చేసి న్యాయం చేయాలని బాధితురాలు కోరారు. వారికి సీపీఐ(ఎంఎల్) నాయకులు మద్దతు తెలిపారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

దామెర: ఇంట్లోకి దొంగ చొరబడి చోరీ చేసేందుకు యత్నించాడు. మండలంలోని తక్కళ్లపహడ్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొత్తపల్లి మహేందర్ ఇంట్లోకి గురువారం తెల్లవారుజామున ఓ దొంగ ప్రవేశించాడు. పలు వస్తువులు దొంగిలించి ఇంట్లో నుంచి పారిపోయే క్రమంలో మహేందర్, కుటుంబ సభ్యులు తేరుకొని కేకలు వేయగా గ్రామస్తులు వెంబడించి దొంగను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సమాచారం. బాధితుడు ఫిర్యాదు చేయగా పోలీస్‌లు కేసు నమోదు చేసినప్పటికీ ధ్రువీకరించలేదు.

మతిస్థిమితం లేని మహిళ మృతి

ఆత్మకూరు: మతిస్థిమితం లేని ఓ వివాహిత బావిలో పడి మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని నీరుకుళ్ళలో గురువారం చోటుచేసుకుంది. నీరుకుళ్ళకు చెందిన న్యాతకాని ఐలమ్మ (55) కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేక వీధుల్లో తిరుగుతుంది. గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్ళి రాలేదు. భర్త సాంబయ్య వెతుకుతూ తమ పొలం వద్దకు వెళ్లాడు. సమీపంలోని బావిలో మృతదేహంపైకి తేలి కనిపించింది. దీంతో సాంబయ్య బోరున విలపించారు. మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. మృతురాలుకు భర్త ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

ఆలయంలో సింహసంక్రమణ పూజలు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు: సూర్యుడు సింహ రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో సింహసంక్రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం అర్చకులు స్వామివారి నిత్య కైంకర్యాలు మొదట నిర్వహించారు. అనంతరం సంక్రమణ పూజలతో పాటు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం చేశారు. గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం శైవాగమోక్తంగా జరిపించారు. అలాగే ఒగ్గు పూజారులు గర్భాలయం ఎదుట మహా మండపంలో నజరుపట్నం వేసి ప్రత్యేక పూజలు చేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, వేద పారాయణదారు గట్టు పురుషోత్తమశర్మ, ఆలయ అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

శాయంపేట : ఎన్నిక సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు హామీని వెంటనే నెరవేర్చాలని రెడ్డి జేఏసీ మండల అధ్యక్షుడు దూదిపాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ నేతలు గెలిచిన వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారాని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు ఊసే లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా రూ. 5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఆయన చేశారు. రెడ్డి కార్పొరేషన్ సాధన కోసం ఈ నెల 19వ తేదీన హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట మందితో నిర్వహించతలపెట్టిన ధర్నాకు జిల్లాలోని రెడ్డీ యువకులు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం ఉద్యమాలు నిర్వహిందేందుకు సిద్ధమైనట్లు ఆయన వెల్లడించారు.